సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 23 । నవంబర్ । 2024



అదనపు కాంటా..
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. 8లో



భయంగుప్పెట్లో ఏజెన్సీ..
వరుస ఎన్‌కౌంటర్లు, ఇన్‌ఫార్మర్ పేరుతో హత్యలు జరుగుతుండగా ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 29° / 16°
జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. సాయంత్రం నుంచి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

భద్రాచలం: రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం భద్రాచలంలో పర్యటించనున్నారు. ఉదయం సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకోనున్నారు. స్థానిక ఏఎంసీ కాలనీలో డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించాక జిల్లా అధికారులతో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన శ్రేణులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఒక ప్రకటనలో కోరారు.

నేటి నుంచి అంతర్రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం కేంద్రంగా నేటి నుంచి 3వ అంతర్రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ భద్రాచలం ప్రెసిడెంట్ యేగి శివ శంకర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని సీతారామ ఆఫీసర్స్ క్లబ్‌లో రెండురోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మొదటి, రెండో, మూడో, నాలుగో బహుమతులు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, ఎలిమినేటర్లకు రూ.2,500 అందిస్తామని తెలిపారు.

'కుడా' ఏర్పాటుపై హైకోర్టులో పిటిషన్

కొత్తగూడెంఅర్బన్: కుడా ఏర్పాటయితే గిరిజనులకు అన్యాయం జరుగుతుందని కొత్తగూడేనికి చెందిన భూక్య సాయికిరణ్ రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ 177 ద్వారా ఆమోదం తెలిపిన విషయం విదితమే. శుక్రవారం పిటిషనర్ తరఫున న్యాయవాది జి.రవిచంద్రశేఖర్, ప్రభుత్వం తరఫున గవర్నమెంట్ ప్లీడరు వాదనలు విన్న హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. గవర్నమెంట్ ప్లీడర్‌ను కౌంటర్ ద్వారా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. కేసును డిసెంబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. కాగా కుడా ఏర్పాటుతో ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కినట్లు అవుతుందని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల వారు, ముఖ్యంగా గిరిజనులు హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కుడా ఏర్పాటుతో జాతీయ ఉపాధి హామీ వర్తించదని తెలిపారు.

కలెక్టర్ దృష్టి పెడితేనే..

కొత్తగూడెం ఎకో టూరిజం సెంట్రల్ పార్క్ మెరుగు..
- నిర్వహణ లోపాలతో కళ తప్పుతున్న 'చలమల' వనం
- బోటింగ్, కాటేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్న జిల్లావాసులు



కొత్తగూడెం సెంట్రల్ పార్కులో వినియోగంలో లేని రోప్ వే

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాను పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పర్యాటక రంగానికి అనువుగా ఉండే చంద్రుగొండ మండలంలోని కనకగిరి గుట్టలు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ గుట్టలు, అశ్వాపురం మండలంలో తుమ్మల చెరువులను స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఎవరూ ఊహించని విధంగా కిన్నెరసాని–కేటీపీఎస్ కెనాల్‌లో పుట్టిలను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇతర ప్రాంతాల పర్యాటకులను ఆకట్టుకునేలా, స్థానికత ఉట్టి పడేలా మట్టి గోడలతో ఇంటి నిర్మాణాలు చేపట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇలా జిల్లాలో పర్యాటక రంగాన్ని పట్టాలెక్కించేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే క్రమంలో కొత్తగూడెంలోని చలమల శ్రీనివాసరావు సెంట్రల్ పార్క్‌పై కూడా దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సెంట్రల్ పార్కు వాకింగ్‌కే పరిమితమా..?
ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఇల్లెందు క్రాస్‌రోడ్డు దగ్గర సుమారు మూడు వందల ఎకరాల విస్తీర్ణంలో సెంట్రల్ పార్కు ఏర్పాటు చేశారు. చిట్టడవిని తలపించే ఈ పార్కులో వివిధ రకాల పళ్లు, పూల మొక్కలు విరివిగా ఉన్నాయి. అతి పెద్ద వాకింగ్ ట్రాక్ సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు ఉంటుంది. ట్రాక్ మధ్యలో వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్, ఓపెన్ జిమ్, యోగా పగోడాలు, పిక్నిక్ సెంటర్లు, చిల్డ్రన్స్ స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు , క్యాంటీన్, ఎత్తైన వ్యూ పాయింట్లు తదితర సౌకర్యాలు ఉన్నాయి. అతి విశాలమైన పార్కులో తిరిగేందుకు వీలుగా బ్యాటరీ కార్లు కూడా ఉన్నాయి. ఫ్యామిలీతో వస్తే ఒక రోజంతా గడిపేందుకు వీలుగా తీర్చిదిద్దారు. ప్రకృతి పర్యాటక విభాగంలో విస్తృతమైన అభివృద్ధి ఆస్కారం కలిగిన ఈ పార్కు ప్రస్తుతం వాకింగ్ ట్రాక్, వనభోజనాల వేడుకలకే పరిమితమవుతోంది. కేవలం నిర్వహణ లోపాల కారణంగా రోజురోజుకూ కళ తప్పుతోంది.

చెత్త కుప్పల్లో బోట్లు..
బోటింగ్ కోసం కేటాయించిన చెరువు మధ్యలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేశారు. విహరించేందుకు వీలుగా జెట్టీ, బోట్లు కూడా వచ్చాయి. కానీ బోటింగ్ సౌకర్యం ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో జలవిహారం కోసం తెచ్చిన బోట్లు చెత్త కుప్పలపాలయ్యాయి. బోటింగ్ ఏరియా చుట్టూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఏషియన్ ఏనుగు విగ్రహం, కుర్చీలు, బెంచీలు ప్రారంభానికి ముందే విరిగిపోతున్నాయి. సెంట్రల్ పార్కులో సగానికి పైగా టాయిలెట్ల తలుపులు విరిగిపోయాయి. నల్లా పని చేయక నిరుపయోగంగా మారాయి. ఇక పగోడాల విషయానికి వస్తే బైసన్ జంక్షన్ దగ్గరున్న పగోడాలే వినియోగంలో ఉన్నాయి. మిగిలినవి కనిపించని విధంగా చెట్లు, చెత్తతో కమ్ముకుపోయాయి. టాయిలెట్లను రిపేర్ చేసి పగోడాలను శుభ్రం చేస్తే మరోసారి పార్కు కొత్త కళ సంతరించుకునే అవకాశం ఉంటుంది.



నిరుపయోగంగా మారిన బోట్లు

కాటేజీలను అందుబాటులోకి తేవాలి
పార్కును ఆరంభించిన కొత్తలో అడ్వెంచర్ టూరిజంలో భాగంగా వంద మీటర్లకు పైగా నిడివితో రోప్ వాక్ వే ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ లోపాల కారణంగా మొత్తం పాడైపోయింది. ఇలాగే కొనసాగితే ఆనవాళ్లు కూడా కోల్పోయే ప్రమాదముంది. పర్యాటకుల బసకు వీలుగా మూడు కాటేజీలు నిర్మించారు. అనంతరం వాటిని అటవీశాఖ ఉన్నతాధికారుల క్యాంపు ఆఫీసులుగా మార్చేశారు. దీంతో ఏడాదిలో నాలుగైదు రోజులు మినహా మిగిలిన సమయంలో నిరుపయోగంగా ఉంటున్నాయి. పార్కుకు ఉన్న ప్రాధాన్యత, ఇక్కడున్న సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కాటేజీలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నివేదికలు సకాలంలో పూర్తి చేయాలి

ఎంఈఓల సమావేశంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: మండల విద్యాధికారులు విద్యా సంబంధిత నివేదికలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. శుక్రవారం ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల విద్యాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం మండలస్థాయిలో అన్ని రిపోర్టులను అప్డేట్ చేసుకుని సబ్మిట్ చేయాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి యూడైస్‌లో ఆధార్ నంబర్ ఎంటర్ చేసి, ఐడీ జనరేట్ చేయాలని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను ప్రతి పాఠశాలలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ పోర్టల్ (ఎస్ఎంఎస్)లో యూనిఫాం డేటాను అప్డేట్ చేయాలని, పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) రిపోర్ట్‌లను స్కూల్ ఎడ్యుకేషన్ పోర్టల్ అదే రోజు అప్డేట్ చేయాలని సూచించారు. ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థులను స్క్రీనింగ్ చేసి రిపోర్ట్ అప్డేట్ చేయడం, విద్యాంజలి పోర్టల్ అన్ని పాఠశాలలను రిజిస్ట్రేషన్ చేసి అప్డేట్ చేయాలని, మధ్యాహ్న భోజనం లో మెనూ పాటిస్తూ, నాణ్యత కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. డిసెంబర్ 3న జరిగే ఎస్ఏఎస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరాచారి, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్‌కుమార్, జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఓ.సైదులు, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా కనకగిరి..



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చంద్రుగొండ : బెండాలపాడు శివారులోని కనకగిరి గుట్టలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మండలంలోని బెండాలపాడు శివారులో ఉన్న బ్యాంబో క్లస్టర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. క్లస్టర్ చైర్మన్‌తోపాటు డైరెక్టర్లతో మాట్లాడారు. కొత్తగా ప్రారంభించిన వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కనకగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే విద్యార్థులు విహారయాత్రలకు కూడా వస్తారని తెలిపారు. ఈ దిశగా ముందడుగు పడుతోందని, డిసెంబర్‌లో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాంతంలో వెదురుతోపాటు ముఖ్యమైన ఔషధ మొక్కలు ఉన్నాయన్నారు. ఇంతటి చరిత్ర ఉన్న ప్రాంతంలో ఫారెస్టు రేంజర్ చలమల శ్రీనివాసరావు హత్యకు గురవడం విచారకరమన్నారు. కొత్తగూడెంలోని కలెక్టరేట్‌ను బ్యాంబో ఉత్పత్తులతో ఆకర్షణీయంగా మలిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంబో అకాడమీ (హైదరాబాద్) అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శ్రీధర్, ప్రెసిడెంట్ శావణ్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ అశోక్, నాయకులు, క్లస్టర్ డైరెక్టర్లు భోజ్యానాయక్, బొర్రా సురేష్, ఉప్పతల ఏడు కొండలు, వీసం నాగభూషణం, కృష్ణయ్య పాల్గొన్నారు.

రేపు ఈత పోటీలు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 24న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఈత పోటీలు కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ హనుమంత రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలను డిసెంబర్ 7,8 తేదీల్లో భూపాలపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు పుట్టిన తేదీ సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 98669 23395 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్య, వసతులు



న్యాక్ బృందంతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

- భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్
- గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

పాల్వంచరూరల్: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గిరిజన కళాశాలలో వసతులు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్యనందిస్తున్నామని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను శుక్రవారం న్యాక్ బృందం పరిశీలించింది. బృందం చైర్మన్ డాక్టర్ వేణుగోపాల్, కోర్డినేటర్ శ్యామ్‌నందసింగ్, సభ్యులు డాక్టర్ ఆషీమోగక్కర్‌లను పీఓ మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. నిష్ణాతులైన ఫ్యాకల్టీతో విద్యా బోధన సాగుతోందని, ల్యాబోరేటరీ సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థినుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వివరించారు. జేఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థినులు ఇంజనీరింగ్, మెడిసిన్ పూర్తి చేసేందుకు ఐటీడీఏ ద్వారా ఆర్థికసాయం చేస్తున్నామని చెప్పారు. ప్రతినెలా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థినుల అభ్యాసన స్థాయిని వివరిస్తున్నామని తెలిపారు. ఆటవిడుపుగా విహారయాత్రలకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఆర్‌సీఓ నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి
భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎం, వార్డెన్, ప్రిన్సిపాల్, సబ్జెక్ట్ టీచర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం మెరుగుపర్చాలని అన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, ఏసీఎంఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పాఠశాలలను పర్యవేక్షించాలని చెప్పారు. డిసెంబర్ మొదటివారంలో ఎస్జీటీలకు ఉద్దేశించి 60 రోజుల శిక్షణ పూర్తి చేసి, అనంతరం పాఠశాలల్లో 100 రోజుల ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. మెరుగైన ఫలితాలు రాకపోతే ఉపాధ్యాయులపై శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు జిల్లాలో 784 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. కొత్తగూడెంలో కోర్టు దగ్గర ఉన్న చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సింగరేణి పాఠశాల, సెయింట్ మేరీస్ హైస్కూల్, బాబుక్యాంపులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావును 99890 27943 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మత్తుపదార్థాల రవాణాను అరికట్టాలి

ఎస్పీ రోహిత్ రాజు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

అశ్వారావుపేటరూరల్: ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలని ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. తొలుత పోలీస్ స్టేషన్, పక్కనే ఉన్న సీఐ, ఎస్సై క్వార్టర్లు, జంగారెడ్డిగూడెం మార్గంలోని సిబ్బంది క్వార్టర్లు, పోలీస్ శాఖకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందితో మాట్లాడారు. న్యాయ సలహా తీసుకుని సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కోడి పందేలు, పేకాట, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విధులను సక్రమంగా నిర్వర్తించాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు నాగరాజు, కరుణాకర్, ఎస్సైలు యయాతి రాజు, శివరామకృష్ణ, దమ్మపేట ఎస్సై సాయికిశోర్ రెడ్డి, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భవనాల నిర్మాణమెప్పుడో..?

- ఏడేళ్లుగా ఇరుకుగదుల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- ప్రతిపాదనలు చేసినా నిర్మాణానికి నోచుకోని పక్కా భవనాలు
- కొత్త మండలాల్లో మౌలిక వసతుల కొరత



సింగరేణి పాత క్వార్టర్‌లో కొనసాగుతున్న చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయం

చుంచుపల్లి: పరిపాలన సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం 2016లో కొత్త జిల్లాలతోపాటు కొత్త మండలాలను కూడా ఏర్పాటు చేసింది. జిల్లాలో గతంలో ఉన్న పాత 17 మండలాలకు తోడు మరో ఆరు.. చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి, ఆళ్లపల్లి, కరకగూడెం కొత్త మండలాలుగా ఆవిర్భవించాయి. ఇవి ఏర్పడి ఏడేళ్లయినా కార్యాలయాలకు పక్కా భవనాలు, అధికారులు, సిబ్బంది కొరత వంటి సమస్యలు ఇంకా తొలగిపోలేదు. ఫర్నిచర్‌తోపాటు ఇతర మౌలిక వసతులు కల్పించలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీడీఓ కార్యాలయాలు, అద్దె భవనాలు, సింగరేణి క్వార్టర్లలో తహసీల్దార్ కార్యాలయాలు, రైతు వేదికల్లో వ్యవసాయశాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది అరకొర వసతుల నడుమ ఇరుకు గదుల్లో అవస్థ పడుతున్నారు.

కొత్త మండలాల కార్యాలయాలను పరిశీలిస్తే..
- ఆళ్లపల్లి మండలం గుండాల నుంచి 12,268 మంది జనాభాతో 10 గ్రామ పంచాయితీలుగా విడిపోయింది. ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం ప్రభుత్వ వెటర్నరీ భవనంలో, మండల పరిషత్ కార్యాలయం ప్రభుత్వ పాఠశాలలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. ఇతర శాఖల కార్యాలయాలకు భవనాలు లేవు.
- అన్నపురెడ్డిపల్లి మండలం 21,130 మంది జనాభాతో 10 గ్రామ పంచాయతీలతో కొత్తగా ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయం సోషల్ వెల్ఫేర్ భవనంలో, ఎంపీడీఓ ఆఫీసు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల భవనంలో కొనసాగుతున్నాయి. ఐకేపీ, వ్యవసాయశాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు.
- కరకగూడెం మండలం 15,221 మంది జనాభా 16 గ్రామపంచాయతీలతో ఆవిర్భవించింది. ఇక్కడ ఆయుర్వేద ఆస్పత్రి భవనంలో తహసీల్దార్ కార్యాలయం, గిరిజన సొసైటీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఐకేపీ, సొసైటీ కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.
- చుంచుపల్లి మండలం 18 గ్రామ పంచాయతీల పరిధిలో 42,290 మంది జనాభాతో ఏర్పడింది. ఇక్కడ మండల పరిషత్ కార్యాలయం పాత ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయం పాడుబడిన సింగరేణి క్వార్టర్‌లో కొనసాగుతోంది. మిగతా శాఖల కార్యాలయాలు కొన్ని అద్దె భవనాల్లోనే ఏర్పాటు చేశారు.
- లక్ష్మీదేవిపల్లి మండలం 38,093 మంది జనాభాతో 31 గ్రామ పంచాయతీలతో మండలంగా ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ప్రభుత్వ పాఠశాల భవనంలో ఏర్పాటు చేయగా, తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది.
- సుజాతనగర్ మండలం 27,989 మంది జనాభాతో 20 పంచాయతీలతో ఏర్పడింది. ఎంపీడీఓ, తహసీల్దార కార్యాలయాలను పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో కొనసాగుతున్నాయి. మిగతా శాఖలకు పక్కా భవనాలు లేవు. ఐకేపీ, వ్యవసాయశాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

కార్యరూపం దాల్చని భవన నిర్మాణాలు
కొత్త మండలాల్లో ఒక్కో భవనానికి రూ.కోటి చొప్పున వెచ్చించి సమీకృత కార్యాలయ భవనాలు నిర్మించాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ కార్యాలయాలు పని చేయాలని సూచించింది. ప్రతిపాదన తీసుకొచ్చి ఏళ్లు గడుస్తున్నా కొన్ని చోట్ల భూ సేకరణ జరగ్గా, మరికొన్ని చోట్ల ముందడుగు పడలేదు. కొన్ని మండలాల్లో ఇప్పటివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు పాత మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలను ఇతర శాఖల భవనాల్లో నిర్వహిస్తున్నారు. కొన్ని మండలాల్లో ఆ వసతి కూడా లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తోంది. నిధుల్లేక అద్దె కూడా రెండు, మూడు నెలలకోసారి చెల్లిస్తున్నారు.

హమాలీ బిడ్డకు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు..



భోగి సమ్మక్క

దమ్మపేట: దమ్మపేట గ్రామానికి చెందిన భోగి సమ్మక్క వరుసగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి పలువురి మన్ననలు అందుకుంటోంది. ఆమె తండ్రి భోగి సత్యం దమ్మపేట గిరిజన సహకార సంస్థలో హమాలీగా పనిచేస్తుండగా, తల్లి రమణ దమ్మపేటలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ(ఇంగ్లిష్) పూర్తి చేసిన సమ్మక్క గతంలోనే సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికవడమే కాక గురువారం విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఇంగ్లిషు లెక్చరర్ ఉద్యోగం సాధించింది. అయితే, సివిల్స్ సాధించడమే లక్ష్యంగా తాను ముందుకెళ్తానని ఆమె తెలిపారు. వరుసగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి ఆదర్శంగా నిలిచిన సమ్మక్కను పలువురు అభినందిస్తున్నారు.

జూనియర్ లెక్చరర్‌గా గిరిజన యువకుడు



సురేందర్‌నాయక్

టేకులపల్లి: మండలంలోని బద్దుతండా గ్రామానికి చెందిన గుగులోత్ సక్రాం – సేవ్రి దంపతుల చిన్న కుమారుడు సురేందర్ నాయక్ గురువారం టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో మ్యాథమెటిక్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. శుక్రవారం ఆయన్ను టీఎస్‌టీటీఎఫ్, సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ధరావత్ ప్రేమ్‌చంద్‌నాయక్, భూక్యా రవి రాథోడ్, బానోతు నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం షురూ


శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఫుట్‌బాల్ జట్టుకు శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ఈ శిబిరానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఎంపిక చేసిన 16 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలి రోజు క్రీడాకారులకు శారీరక వ్యాయామం, ఫుట్‌బాల్ క్రీడలోని మెళకువలను జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు గౌతంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బట్టు ప్రేమ్‌కుమార్ వివరించారు. శిబిరంలో పాల్గొనే క్రీడాకారులకు స్థానిక హోటల్లో బస ఏర్పాటు చేశారు. వారికి స్పోర్ట్స్ డైట్‌ను నిర్వాహకులు అందజేశారు. ఈ శిబిరం నవంబర్ 25 వరకు కొనసాగుతుంది. జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఈ నెల 30 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు జమ్మూ కశ్మీర్‌లో జరగనున్నాయని ఫెడరేషన్ కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్ తెలిపారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం..


గీతాహర్షిణిని అభినందిస్తున్న డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: స్థానికులు క్రీడల్లో రాణించేలా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో రెజ్లింగ్ క్రీడాకారిణి ఆర్.గీతాహర్షిణి, అసోసియేషన్ సభ్యులు.. డీవైఎస్‌ఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ.. ఇటీవల మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో అండర్-17 విభాగంలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిందన్నారు. డిసెంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు గీతాహర్షిణి ఎంపికవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పి.కాశీహుస్సేన్, నరేశ్, రవి, తిరుమల్‌రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రామయ్య సేవలో డిప్యూటీ డైరెక్టర్


ఆలయం వద్ద రాజవర్ధనాచారి తదితరులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానాన్ని రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ రాజవర్ధనా చారి సందర్శించారు. కుటుంబ సమేతంగా స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామివారి జ్ఞాపిక తోపాటు ప్రసాదం అందజేశారు. జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి సంపత్‌కుమార్, జిల్లా కార్యదర్శి పరిమి సోమశేఖర్ పాల్గొన్నారు.

భద్రాచలం వాసి మంజులకు డాక్టరేట్


బుడగం మంజులాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలంకు చెందిన బుడగం మంజులాదేవి కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సీనియర్ ఆచార్యులు కె.పురుషోత్తం ఆధ్వర్యాన ఆమె సాహిత అకాడమీ అవార్డు గెలుచుకున్న నవలలపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంధానికి డాక్టరేట్ ప్రకటించారు. కాగా, మంజుల, ఆమె భర్త కాంగ్రెస్ నాయకుడైన బుడగం శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

చేప పిల్లల పంపిణీ

దుమ్ముగూడెం: జిల్లా మత్స్య సహకార శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గంగోలు చెరువులో 31,800, నల్లబల్లి చెరువులో 37,500 చేప పిల్లలను శుక్రవారం జిల్లా మత్స్యశాఖాధికారి ఎండీ ఇంతియాజ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి కోటేశ్వరరావు, సిబ్బంది మంగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వేధింపులు

ఇల్లెందు: మద్యానికి బానిసైన తన భర్త మానసికంగా వేధిస్తున్నాడని పట్టణంలోని కొత్తబస్టాండ్ ఏరియాకు చెందిన జివ్వాజి నమిత శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలికి 14 ఏళ్ల కిందట చిన్నరాముతో వివాహమైంది. ఇటీవలి కాలంలో రాము రోజూ మద్యం సేవించి ఇంటికి రావడంతోపాటు వేధిస్తున్నాడని నమిత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ రవి తెలిపారు.

అదనపు కాంటా.. ఇదేమిటంటా?

- ధాన్యం తూకానికి అదనంగా 500గ్రా. కలుపుతున్న నిర్వాహకులు
- కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు తూట్లు
- రైతులపై భారం మోపుతున్న నిర్వాహకులు
- వారి నుంచే హమాలీ కూలీ వసూలు


కొనుగోలు కేంద్రంలో అదనంగా వేసిన ధాన్యం కాంటా (41 కేజీల 50 గ్రాములు)

దమ్మపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని, అధిక బరువుతో కాంటా వేయిస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో గిరిజన సహకార సంస్థ, కోఆపరేటివ్ సొసైటీల ఆధ్వర్యంలో వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైతులు, తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు భారీగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు కల్పించాల్సిన తాగునీరు, టార్పాలిన్ పట్టాలు వంటి కనీస సౌకర్యాలను కల్పించకుండా కొనుగోలు కేంద్రాల బాధ్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కాంటా వేసిన హమాలీల కూలీ రేట్లను కూడా రైతుల వద్దనే వసూలు చేస్తున్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించే యంత్రం పనిచేయడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

500 గ్రాములు అదనంగా కాంటా..

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం తూకంలో ఒక గన్నీ సంచికి 500 గ్రాములకు పైగా అదనంగా కాంటా వేయిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంటా వేసే గన్నీ సంచి బరువు 500 గ్రాములు ఉండగా, ఆ సంచిలో గరిష్టంగా 40 కేజీల వరకు ధాన్యం నింపవచ్చు. నిబంధనల ప్రకారం ఒక సంచి బరువు, దానిలో నింపిన 40 కేజీల ధాన్యంతో కలిపి మొత్తంగా 40 కేజీల 500 గ్రాములు మాత్రమే కాంటా వేయాల్సి ఉంది. కానీ, 41 కేజీల 50 గ్రాముల వరకు నిర్వాహకులు కాంటా వేయిస్తున్నారు. దీనిపై ప్రశ్నించగా.. నిర్వాహకుల నుంచి సరైన సమాధానం లభించలేదని రైతులు వాపోతున్నారు.

రైతులే కాపలా..

ధాన్యం కాంటా వేసిన తరువాత దానికి సంబంధించిన పూర్తి బాధ్యత కొనుగోలు కేంద్రాలే వహించాల్సి ఉంది. కానీ, అందుకు విరుద్ధంగా కొనుగోలు చేసిన ధాన్యం అంతా లారీలో లోడ్ చేసే వరకు రైతులే కాపలా కాయాల్సి వస్తోందని అంటున్నారు. ఒక పెద్ద లారీకి సరిపడా ధాన్యం కాంటా అయ్యి, వాటిని లారీలో లోడ్ చేయాలంటే రెండు రోజులు పడుతుందని, అప్పటివరకు ధాన్యానికి తామే కాపలాగా ఉండాలంటే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మేనేజర్ స్పందన కరువు..

దీనిపై దమ్మపేట జీసీసీ మేనేజర్ పాపారావును వివరణ కోరడానికి ఫోన్‌లో పలుమార్లు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

రైతులతో చాకిరి


గన్నీ సంచులపై ముద్ర వేస్తున్న రైతు

రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన నిర్వాహకులు దీనికి విరుద్ధంగా ఆ రైతులతోనే బలవంతంగా అదనపు పనులను చేయిస్తున్నారు. ధాన్యం రకాన్ని తెలియజేసే వివరాలను గన్నీ సంచులపై రంగులతో రాయించే బాధ్యతను నిర్వాహకులు, రైతులపై బలవంతంగా మోపుతున్నారు. దీంతో రైతులు ఎదురు చెప్పలేక రంగులను స్వయంగా కొనుగోలు చేసి, గన్నీ సంచులపై ధాన్యం రకానికి సంబంధించిన వివరాలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేగాక సంచులను ధాన్యంతో నింపిన అనంతరం వాటిని కుట్టడానికి అవసరమైన తాడు (పురికోస)ను రైతులచే బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారు. ధాన్యం కాంటా వేసినందుకు గాను ఒక సంచికి రూ.24ను రైతుల నుంచే హమాలీ కూలీ పేరుతో వసూలు చేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పెట్టొద్దు..



కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను నిర్వాహకులు ఇబ్బంది పెట్టడం సరికాదు. ధాన్యం కాంటాలు అధికంగా వేయడమే కాకుండా రైతులతో రంగులు, పురికోసలను కొనుగోలు చేయించడంపై అధికారులు స్పందించాలి. నిర్వాహకులు చెప్పిన రంగులు, పురికోసను నేనే స్వయంగా కొనుగోలు చేసి, ఒక కూలీతో సంచులపై అక్షరాలు రాయించాను. కాంటా కూలీ డబ్బులు ఒక సంచికి రూ.24 చొప్పున రైతుల నుంచి వసూలు చేయడం శోచనీయం.

– గొట్టిముక్కల కృష్ణంరాజు, రైతు

ఇన్‌ఫార్మర్ల పేరిట...
ఇద్దరిని హతమార్చిన మావోలు

- మృతుల్లో ఒకరు గ్రామపంచాయతీ కార్యదర్శి
- మృతులిద్దరూ వరుసకు అన్నదమ్ములు
- భద్రాచలం నియోజకవర్గం వాజేడులో ఘటన


అర్జున్ (ఫైల్)


రమేష్ (ఫైల్)

వాజేడు: పోలీసులకు తమ సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలతో మావోయిస్టులు గురువారం రాత్రి ఇద్దరు గిరిజనులను గొడ్డళ్లతో నరికి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన భద్రాచలం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ములుగు జిల్లా వాజేడులోని పోలీస్‌స్టేషన్‌కు అర కిలోమీటర్ దూరాన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వాజేడు మండలం బాల లక్ష్మీపురం(పెనుగోలు కాలనీ) గ్రామానికి చెందిన వరుసకు సోదరులైన ఉయికె రమేష్(38), ఉయికె అర్జున్(38)ను మావోయిస్టులు విచక్షణారహితంగా గొడ్డళ్లతో నరికి చంపారు. గురువారం రాత్రి 11 గంటల సమయాన అర్జున్ ఇంటికి ముగ్గురు మావోయిస్టులు వచ్చారు. ఆయనను బయటకు తీసుకువచ్చి గొడ్డళ్లతో నరకగా.. అదే సమయాన మరో ముగ్గురు మావోయిస్టులు గ్రామ కార్యదర్శి అయిన ఉయిక రమేష్ ఇంటికి వెళ్లి అడ్డుగా కట్టిన గుడ్డను కత్తులతో కోసి లోపలికి చొరబడ్డారు. బెడ్‌పై పడుకున్న రమేష్‌ను గొడ్డళ్లతో నరికారు. ఆయన కొన ఊపిరితో ఉండగా స్థానికులు ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం చేస్తుండగానే కన్నుమూశాడు. కాగా, ఈ ఘటనలో ఎందరు మావోయిస్టులు పాల్గొన్నారనది తెలియరాలేదు. రమేష్‌కు భార్య రాంబాయి, ఒక కూతురు, ఇద్దరు అబ్బాయిలు ఉండగా, అర్జున్‌కు భార్య సావిత్రి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతులిద్దరూ వరుసకు అన్నదమ్ములు. రమేశ్ పేరూరు గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

లేఖ వదిలిన మావోయిస్టులు

పశువులు కాయడానికి వస్తున్న ఉయికె అర్జున్ మావోయిస్టు దళాల సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడని, రమేష్ కూడా ఇదే పనిచేస్తున్నాడని మృతదేహాల వద్ద వాజేడు, వెంకటాపురం ఏరియా కమిటీ శాంత పేరుతో లేఖ వదిలారు. తన స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకుని పోలీసులకు చేరవేస్తూ మావోయిస్టులపై పోలీసులు దాడులు చేయడానికి రమేష్ కారణమని ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా, మృతదేహాలను ఏటూరు నాగారం సామాజిక ఆస్పత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘాలు, ఆదివాసీలు శుక్రవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము గుట్టలపై జీవిస్తున్నప్పుడు ప్రశాంతంగా ఉండేదని, బతుకుదెరువు కోసం కిందకు దిగి వస్తే మావోయిస్టులు హత్య చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు పోలీసులు, అటు మావోయిస్టుల నడుమ నలిగిపోతున్నామని వాపోయారు. అడవిలో పనిచేసుకుంటూ బతికే తమను పోలీస్ కొరియర్లుగా చిత్రీకరించి హతమార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

భయం గుప్పెట్లో ఏజెన్సీ..



వాజేడులో ఇద్దరి హత్యతో అడవిబిడ్డల్లో ఆందోళన

దుమ్ముగూడెం: వరుస ఎన్‌కౌంటర్లు, ఇన్‌ఫార్మర్ పేరుతో హత్యలు జరుగుతున్న నేపథ్యాన ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2026 నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా, కొంతకాలంగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్లలో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. సహచరులను కోల్పోయిన మావోయిస్టులు ప్రతికారేచ్ఛతో రగిలిపోతున్నారు. ఈ క్రమాన ఇన్‌ఫార్మర్ల పేరుతో మావోలు పలువురిని హతమారుస్తుండగా.. భద్రాచలం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వాజేడులో గురువారం ఇద్దరు ఆదివాసీలను హత్య చేయడం సంచలనం సృష్టించింది.

పెరిగిన నిఘా..

మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉండడతో పాటు నిఘా వ్యవస్థను పటిష్టం చేశాయి. ఈక్రమాన మావోయిస్టులు తమ సంచారాన్ని తెలియకుండా జాగ్రత్త పడుతున్నా పోలీస్ వ్యవస్థకు ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో పసిగడుతున్నారు. వైద్యం నిమిత్తం లేదా మరేదైనా పనుల కోసం తెలంగాణ వైపు వస్తున్న వారిని గుర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసుల పటిష్టమైన నిఘా వ్యవస్థతో అడవి నుంచి అడుగు తెలంగాణ వైపు పడితే కదలికలను ట్రాక్ చేస్తూ అదుపులోకి తీసుకుంటుండడంతో మావోయిస్టులకు ఎటూ పాలుపోవడం లేదు. దీంతో తమ ఉనికిని తెలిపేందుకు ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్యలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగా అనవసర ఇబ్బందులు ఎందుకనుకునే వారు కొన్నాళ్లు పట్టణాలకు వెళ్లాలని సిద్ధమవుతుండగా, మరికొందరు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు.

సరిహద్దు కావడంతో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా కేంద్రం గుర్తించింది. తెలంగాణలో మావోయిస్టులు అంతో ఇంతో ప్రభావం ఇక్కడే చూపుతున్నారు. చెదురుమదురు హింసాత్మక ఘటనలతో పాటు లేఖలు, వాల్ పోస్టర్ల ద్వారా ఉనికి చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో ఈ ఏడాది జిల్లాలో రెండు ఎన్‌కౌంటర్లు జరగగా ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. పదుల సంఖ్యలో లొంగిపోయారు. మరింతమంది ఇదే బాటలో ఉన్నట్లు సమాచారం. ఈ సమయాన వాజేడులో ఇద్దరిని మావోలు హతమార్చడంతో ఏజెన్సీ వాసుల్లో ఆందోళనను తీవ్రం చేసింది.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం..


ప్రదర్శన నిర్వహిస్తున్న పెంకు పరిశ్రమ కార్మికులు

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్మించి సంఘటిత శక్తితో ప్రతిఘటిద్దామని ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని ముకుందాపురం క్యాంపు సెంటర్‌లో ఇఫ్టూ అనుబంధ టీటీడబ్ల్యూ రాష్ట్ర రెండో మహాసభను శుక్రవారం నిర్వహించగా వారు మాట్లాడారు. బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలంతో దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల చట్టాలను తయారు చేస్తూ అదానీ, అంబానీలను అపర కుబేరులుగా తయారు చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పరిపాలన కొనసాగుతోందని ఆరోపించారు. మత, కుల వివక్షతో సనాతన ధర్మం పేరుతో దాడులు జరుగుతున్నా కేంద్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఐక్యంగా కార్మికులు సాధించుకున్న హక్కులను పాలకులు సవరణల పేరుతో అన్యాయం చేసే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. తొలుత పెంకు పరిశ్రమల కార్మికులు ముకుందాపురంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కే మదార్, బానోత్ రాంసింగ్, లింగ్యా, దుర్గాప్రసాద్, మూతి రాంబాబు, సనప రాంబాబు, సాంబ, సారయ్య, రంగబాబు, సత్తిబాబు, శ్రీరాములు, స్వరూప, బుగ్గ రవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ విఫలమైందని డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని గణేశ్ నర్సింగ్ హోంలో డాక్టర్ ఎం.బసంతి చేసిన ఆపరేషన్ విఫలమై తీవ్ర ఇబ్బంది ఎదురవుతోందని మేదరబస్తీకి చెందిన బొమ్మెరబోయిన నాగమహేశ్వరి శుక్రవారం డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఏడాది జూన్‌లో డెలివరీ కోసం గణేశ్ నర్సింగ్ హోంలో చేరగా.. ఆపరేషన్ చేసిన తర్వాత నెల రోజుల నుంచి కడుపునొప్పి వస్తోందని, అక్కడ గడ్డలు ఏర్పడ్డాయని తిరిగి డాక్టర్ బసంతిని సంప్రదించినట్లు పేర్కొంది. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చిన అనంతరం ఒక కుట్టును కత్తిరించి ఏమీ లేదని ఇంటికి పంపించారని చెప్పింది. ఆ తర్వాత ఆపరేషన్ చేసిన చోట పుండు కావడంతో పాటు రక్తం, దారాలు కూడా బయటకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఆపరేషన్ వల్ల జరిగిన నష్టాన్ని డాక్టర్ బసంతికి వివరిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు తనకు సంబంధం లేదని బుకాయిస్తోందని ఫిర్యాదులో వివరించింది.


డీఎం,హెచ్‌ఓకు ఫిర్యాదు ఇస్తున్న బాధితురాలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అశ్వారావుపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ వసంత్ శుక్రవారం తెలిపారు. ఈ నెల తొలి వారంలో ఉమ్మడి జిల్లాలోని ఎంజేపీటీ గురుకులాల విద్యార్థులకు బోనకల్లు మండలంలో అథ్లెటిక్స్, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా, అశ్వారావుపేట గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-17 విభాగంలో అశోక్, చరణ్‌తేజ్, హర్షానాయక్, రోహిత్, అండర్-14 విభాగంలో నాగచైతన్య విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారని చెప్పారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు హైదరాబాద్‌లోని తురకపల్లి జ్యోతిస్మతి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

మావోల ఇలాఖాలో మరో పోలీసు క్యాంపు

చర్ల: మావోయిస్టుల అడ్డాలో పోలీసులు ఇంకో క్యాంపు ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుక్మా జిల్లాల్లో అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన పువ్వర్తి, కొండపల్లి, తుమ్మలపాడు ప్రాంతాల్లో పోలీసు క్యాంపులను ఏర్పాటు చేశారు. తాజాగా శుక్రవారం బీజాపూర్ జిల్లాలోని పామేడు పోలీస్ స్టేషన్ పరిధి జీడిపల్లి సమీపాన క్యాంపు ఏర్పాటుకు సిద్ధమయ్యారు. బీజాపూర్ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలకు చెందిన సుమారు 800 మంది జవాన్లు అక్కడకు చేరుకున్నారు. శుక్రవారం రాత్రి కూడా చర్ల మీదుగా బస్సులు, లారీల్లో వందలాది మంది జవాన్లను జీడీపల్లి సమీప అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించేందుకు తరలించారు.

ఎఫ్‌ఆర్‌ఓ త్యాగం మరువలేనిది


ఎఫ్‌ఆర్‌ఓ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్, శ్రీనివాసరావు భార్యాపిల్లలు

చుంచుపల్లి: అడవుల సంరక్షణనే ధ్యేయంగా పనిచేస్తూ విధి నిర్వహణలో గొత్తికోయల దాడిలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరవీరుడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చలమల శ్రీనివాసరావు త్యాగం మరువలేనిదని జిల్లా అటవీశాఖ అధికారి కిష్టాగౌడ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం సీఎస్‌ఆర్ సెంట్రల్ పార్క్‌లో రెండో వర్ధంతి నిర్వహించారు. శ్రీనివాసరావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో డీఎఫ్‌ఓ మాట్లాడుతూ అడవుల సంరక్షణలో అటవీశాఖ సిబ్బంది, ఉద్యోగుల కృషి ఎనలేనిదని అన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం విధుల్లో ఉంటూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరావు సతీమణి భాగ్యలక్ష్మి, పిల్లలు, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్లు కోటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, సుజాత, మక్సూద్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి


బుచ్చయ్య (ఫైల్)

గుండాల: మేడారం సమ్మక్క భర్త ఆరెం వంశీయుడు పగిడిద్దరాజు (జాతర) ప్రధాన పూజారి, శతాధిక వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. మండలంలోని వేపలగడ్డ గ్రామానికి చెందిన ఆరెం బుచ్చయ్య (110) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏటా పగిడిద్దరాజు జాతరను వేపలగడ్డ గ్రామంలో నిర్వహిస్తారు. ఈ జాతరకు మృతుడు ప్రధాన పూజారిగా పనిచేస్తున్నాడు.

బుల్లెట్ ఢీకొని వ్యక్తి...

పాల్వంచరూరల్: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బుల్లెట్ ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన మాలోతు లచ్చు (40) శుక్రవారం రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా సారపాకవైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం (బుల్లెట్) ఢీకొట్టింది. దీంతో లచ్చు అక్కడికక్కడే మృతిచెందాడు. బుల్లెట్ నడుపుతున్న రెహమాన్‌ను స్థానికులు కొట్టారు. ఎస్ఐ సురేశ్‌ను వివరాలు కోరగా రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు సమాచారం అందిందని, ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..


నాగేశ్వరరావు (ఫైల్)

సుజాతనగర్: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారిపై నాయకులగూడెం వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రమాదేవి కథనం ప్రకారం.. జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండా గ్రామ పంచాయతీ, పెద్దతండా గ్రామానికి చెందిన లకావత్ నాగేశ్వరరావు (43) పని నిమిత్తం కొత్తగూడెం వెళ్లాడు. ఆయన భార్య నిర్మల ఇదే మండలంలోని లైన్‌తండాలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై భర్త కోసం సుజాతనగర్‌లో ఆగింది. ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా నాయకులగూడెం గ్రామం వద్ద రాష్ట్రీయ రహదారిపై ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నిర్మలను కొత్తగూడెంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: కొంతకాలంగా మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నాడని ఓ వివాహిత తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసయడంతో వారు కేసు నమోదు చేశారు. పట్టణంలోని 13వ నంబర్‌బస్తీకి చెందిన దీప్తిని ఆమె భర్త కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు తాళలేక దీప్తి శుక్రవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై...

ఇల్లెందు: అదనపు కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని పట్టణంలోని సబ్‌జైల్‌బస్తీకి చెందిన వివాహిత ఎండీ ఫేర్‌దాస్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు సబ్ జైల్ బస్తీకి చెందిన ఖురేషీతో జూలైలో వివాహమైందని, నాటి నుంచి భర్తతోపాటు అత్త అనీషా, మామ జిలానీ, మరిది శంషీ అదనపు కట్నం తేవాలని తరచూ వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ సూర్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

కొత్తగూడెంరూరల్: ద్విచక్రవాహనాల్లో తరలిస్తున్న 17 కేజీల గంజాయిని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. ఇల్లెందు క్రాస్‌రోడ్డులో లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి వాహనాల తనిఖీ చేపట్టి.. హైదరాబాద్‌కు వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాల ద్వారా తరలిస్తున్న 17 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన కోట కృపాకర్, ఆపిసా నర్సింహ, హిమాయత్‌నగర్‌కు చెందిన కదిరి శివారెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

బెల్టు దుకాణంలో మద్యం...

పాల్వంచ: బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కేటీపీఎస్ 5వ దశ గేటు ముందు అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై ఎస్ఐ రాఘవయ్య దాడి సిబ్బందితో కలిసి చేశారు. దాడిలో రూ.6,500 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, షాపు నిర్వాహకుడు బుడగం సత్యనారాయణపై కేసు నమోదు చేశారు.